క్లుప్తంగా

బడి బయట పిల్లలు బడిలో చేరాలి


రత్నగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రొళ్ల: బడి బయట ఉన్న పిల్లలు బడిలో చేరాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రత్నగిరి ఉన్నత, ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి 'నేను బడికి పోతా' అనే కార్యక్రమంలో భాగంగా గ్రామ పుర వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. అగళి మండలానికి వెళ్లే కూడలిలో శ్రీకృష్ణదేవరాయుల విగ్రహం ఆవరణలో మానవహారంగా ఏర్పాడి అవగాహన కల్పించారు. ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిషత్తును దృష్టిలో పెట్టుకుని ఇంటి పనులకు పరిమితం చేయకుండా సక్రమంగా పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం హరిప్రసాద్, విద్యార్థులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ


విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కిట్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 100 పడకల ఆస్పత్రి భవనాల పనులను కూడా పరిశీలించారు. తర్వాత ఆర్అండ్‌బీ బంగ్లాలో అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. సమస్యలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. తదనంతరం పట్టణంలోని దినసరి మార్కెట్‌ను, ఓ ప్రైవేట్ డెయిరీని కూడా పరిశీలించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన మూర్తప్ప

రొళ్ల: అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి అదుపుతప్పి కింద పడిన ఘటనలో మూర్తప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే... మడకశిరకు చెందిన మూర్తప్ప పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో మంగళవారం రొళ్ల వైపు వస్తుండగా పట్టణ సమీపంలోని జాతీయ రహదారిలో అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి కిందుపడ్డాడు. తీవ్రంగా గాయపడిన మూర్తప్పను రత్నగిరి ఆపదమిత్ర, వలంటీర్ పరమేష్ మానవతా దృక్పథంతో తన ద్విచక్ర వాహనంలో రొళ్ల సీహెచ్‌సీకి తరలించాడు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దోమల నివారణకు చర్యలు


ఫళారం గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికులు


గుడిబండ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యురాలు సౌందర్య పేర్కొన్నారు. మండల పరిధిలోని ఫళారం గ్రామంలో మంగళవారం దోమల నివారణకు పంచాయతీ కార్మికులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే శానిటేషన్ పనులు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఖోఖో టోర్నీ విజేత 'కుణిగల్ కళాశాల'


ట్రోఫీ అందుకుంటున్న కుణిగల్ కళాశాల జట్టు

పావగడ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన తుమకూరు విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల ఖోఖో క్రీడా పోటీల్లో కుణిగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజేతగా నిలిచింది. అలాగే పోటీలకు ఆతిథ్యమిచ్చిన పావగడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానం చేజిక్కించుకుంది. విజేతగా నిల్చిన కుణిగల్ జట్టుకు ట్రోఫీ అందజేశారు. ఈ పోటీల్లో 8 డిగ్రీ కళాశాలలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పోటీలను నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో కుణిగల్ జట్టు, పావగడ జట్టు హోరాహోరీగా తలపడగా చివరకు కుణిగల్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది.

క్లాస్ దోపిడీ



చిరుద్యోగి అయిన రమేష్‌కు ఇద్దరు పిల్లలు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని హిందూపురంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదివిస్తున్నాడు. ఒకరు ఐదు, మరొకరు ఏడో తరగతి. వారిద్దరి చదువుకు ఏడాదికి రూ. 70 వేల వరకూ ఫీజుల రూపంలో చెల్లించాల్సి వస్తోంది. నెలకు రూ.20 వేలు మాత్రమే సంపాదించే రమేష్‌కు పిల్లల చదువు భారంగా మారింది. అయినప్పటికీ ఇంగ్లిష్ మీడియం చదువు మాన్పించలేక ఏటా ఖర్చులు భరించలేక మదన పడుతున్నాడు.

- ప్రైవేట్ స్కూళ్లలో భారీగా ఫీజులు
- డొనేషన్లు, పుస్తకాల పేరుతో అదనపు వసూళ్లు
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు

హిందూపురం టౌన్: వేసవి సెలవుల అనంతరం స్కూళ్లు తెరుచుకోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజుల కష్టాలు మొదలయ్యాయి. కాన్వెంట్ ఫీజు పక్కన పెడితే.. డొనేషన్లు, బస్ ఫీజు, పుస్తకాలు, యూనిఫాం పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు.

అవసరం లేకపోయినా పుస్తకాలు

మూడేళ్ల పిల్లోడిని ప్రైవేట్ స్కూల్‌లో చేర్పించేందుకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ ఫీజులు వసూలు చేస్తున్నారు. డొనేషన్లు, అడ్మిషన్ ఫీజు, స్కూల్ ఫీజు, యూనిఫాం, షూ, పుస్తకాలతో పాటు బస్ ఫీజులు చెల్లించాలి. ఇక కార్పొరేట్ స్కూళ్లలో పిల్లలను చదివించాలంటేనే తల్లిదండ్రులు భయపడిపోతున్నారు. అవసరమైన సబ్జెక్టులు నాలుగే అయినప్పటికీ ఊహ తెలియని పిల్లాడికి కూడా డ్రాయింగ్, జీకే, గ్రామర్, హిందీ, సైన్సు అంటూ రకరకాల పుస్తకాలు కొనిపిస్తున్నారు. విద్యార్థుల ఫీజులపై ప్రభుత్వం నిర్దిష్ట విధానాన్ని ప్రకటించి ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు వాటిని పాటించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో 78 ప్రైవేటు స్కూళ్లు

హిందూపురం నియోజకవర్గంలో మొత్తం 78 ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. ఇందులో హిందూపురం మండలంలో 72, లేపాక్షి మండలంలో రెండు, చిలమత్తూరులో నాలుగు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రైవేటు స్కూళ్లలో ఎల్‌కేజీ నుంచి ఐదో తరగతి వరకూ చదివే విద్యార్థుల నోటు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగుల, ఆటో ఫీజులు, పాఠశాల ఫీజులు కలిసి రూ.28 వేల నుంచి రూ.34 వేల వరకూ చెల్లించాల్సి వస్తోంది. అలాగే 6 నుంచి 10వ తరగతి వరకూ చదివే విద్యార్థులకైతే ఈ ఫీజులు, ఇతర ఖర్చుల మోత రెట్టింపవుతోంది.

ముక్కుపిండి ఫీజుల వసూలు

ప్రైవేటు, కార్పొరేట్, టెక్నో, ఈ–టెక్నో, ఒలంపియాడ్, ఇంటర్నేషనల్ ఇలా వివిధ రకాల పేర్లతో యాజమాన్యాలు పిల్లల తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తూ పెద్ద మొత్తంలో ఫీజులను ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో వివిధ తరగతులకు రూ.20 వేల నుంచి రూ.50 వేల దాకా ఫీజులు, ఇతర ఖర్చులు ఉంటే.. ఇక కార్పొరేట్, ఇతర వాటిల్లో రూ.40 వేల నుంచి రూ.లక్ష దాకా వసూలు చేస్తున్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి అడ్మిషన్ ఫీజు రూ.2 వేల నుంచి రూ.6 వేలు, జత యూనిఫాంకు రూ.1200 నుంచి రూ.1600, స్టడీ మెటీరియల్, నోట్ పుస్తకాలకు రూ.2 వేల నుంచి రూ.6 వేల వరకూ వసూలు చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలకు తూట్లు

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఫీజులను నియంత్రిస్తూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు సంబంధించి ప్రభుత్వం జీఓను జారీ చేసింది. దీని ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏ తరగతికి గరిష్ఠంగా ఫీజు రూ.24 వేలకు మించకూడదని నిబంధన విధించింది. అలాగే ఉన్నత పాఠశాలల్లో రూ.30 వేలకు మించకూడదని స్పష్టం చేసింది. దీంతో పాటు విద్యా హక్కు చట్టం ప్రకారం డొనేషన్లు, అడ్మిషన్ ఫీజులు వసూలు చేయకూడదని తేల్చిచెప్పింది. పాఠశాల ప్రాంగణంలోనే విద్యా సామగ్రి అమ్మకూడదని వెల్లడించింది. అయితే ప్రైవేటు విద్యాసంస్థలు ఈ నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా విద్యా దోపిడీకి పాల్పడుతూ ఇష్టానుసారంగా ఫీజులను పెంచేసి వసూలు చేస్తున్నాయి. దీనిపై విద్యాశాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాలు ఉండవు

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా పెద్ద మొత్తంలో ఫీజులను వసూలు చేస్తున్నారు. పాఠశాలలో ఫీజుల వసూలు దందాగా మారిపోయింది. ఫీజులపై ఎలాంటి నియంత్రణ లేదు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చాలా వాటిలో మౌలిక సదుపాయాలు కూడా లేవు. పాఠశాలల ఆవరణలోనే పుస్తకాలు, విద్యా సామగ్రిని విక్రయిస్తున్నారు. వీటన్నింటిపై విద్యాశాఖాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి.



– బాబావలి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

అధిక ఫీజు వసూలు చేస్తే చర్యలు

ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్కరూ తమ పాఠశాలల్లో ఫీజుల పట్టికను నోటీసు బోర్డులో ప్రదర్శించాలి. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు నిబంధనలు విధిగా పాటించాలి. ఎప్పటికప్పుడు తాము ప్రైవేటు పాఠశాలలను పర్యవేక్షిస్తున్నాం. అధిక ఫీజులు వసూలు చేస్తే ఎవరైనా ఫిర్యాదు చేయొచ్చు. పాఠశాల ఆవరణలో పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి అమ్మితే ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటాం.



– గంగప్ప, ఎంఈఓ, హిందూపురం

వైఎస్ జగన్‌ను కలిసిన ఈరలక్కప్ప



మడకశిర: తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మడకశిర వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడుతో కలిసి వెళ్లారు. మడకశిర నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వైఎస్ జగన్ అడిగి తెలుసుకున్నట్లు ఈరలక్కప్ప ‘ఫోన్’ ద్వారా సాక్షికి తెలిపారు. ఓటమితో కుంగిపోవద్దని, భవిష్యత్‌లో పార్టీ అధికారంలోకి వస్తుందని వైఎస్ జగన్ ధైర్యం చెప్పినట్లు వివరించారు. నాయకులు, కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారని తెలిపారు. పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారన్నారు. మడకశిరలో గట్టి పోటీ ఇచ్చావని వైఎస్ జగన్ తనను అభినందించినట్లు తెలియజేశారు.

మహేశ్వరీదేవికి జ్యోతులు


అలంకరణలో మహేశ్వరీదేవి

లేపాక్షి: మండలంలోని వడ్డిపల్లిలో వెలిసిన మహేశ్వరిదేవి అమ్మవారికి గ్రామస్తులు జాతర నిర్వహించడంతో పాటు భక్తులు జ్యోతులు మోశారు. మంగళవారం ఉదయం ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం నిర్మించి 41 రోజులు పూర్తికావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వహించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్

పెనుకొండ: బాల్య వివాహాలను నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఏ గ్రామంలోనూ బాల్య వివాహాలు జరగకుండా ప్రతి అంగన్‌వాడీ ఉద్యోగులు చూడాలన్నారు. ఒకవేళ బాల్య వివాహం జరిగితే ఆ ప్రాంత అంగన్‌వాడీ కార్యకర్తే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. అదే విధంగా సెంటర్లలో ప్రతి చిన్నారి, గర్భిణీ, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలని సబ్‌కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర


అలంకరణలో గంగమ్మ

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లిలో గంగమ్మ జాతరను మంగళవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు ప్రత్యేకంగా జ్యోతులు, బాణాలను అమ్మవారికి సమర్పించారు. మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర, నాయకులు ప్రసాద్‌రెడ్డి, బైపిరెడ్డి నివాసాల్లో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఎమ్మెల్సీ మంగమ్మ, సర్పంచ్ అశ్వర్థనారాయణ, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, రామ్మోహన్‌రెడ్డి, వైశాలి జయశంకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దండు మారెమ్మ విగ్రహ ప్రతిష్ట


దండు మారెమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పరిగి: మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన దండు మారెమ్మ అమ్మవారి సింహ వాహన విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే అమ్మవారి సింహ వాహన విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేయగా.. తర్వాత కళారాధన, నవగ్రహ, మృత్యుంజయ హోమాలను నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటూ అన్నదానం చేపట్టారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి

పెద్దిరెడ్డిపల్లిలో మంగళవారం నిర్వహించిన దండు మారెమ్మ అమ్మ వారి సింహ వాహన విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ సాకమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మారుతీరెడ్డి, స్థానిక నాయకులు బీఆర్ నారాయణ, రాజేష్, ప్రభాకర్, నాగభూషణ, నాగమణి, పద్మక్క, నరసింహారెడ్డి, శివరామిరెడ్డి, గఫూర్‌ఖాన్, రఫీక్, సింగారెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతులు మోస్తున్న మహిళలు


కురుబరహళ్లిలో కొలువుదీరిన దుర్గమ్మ

వైభవంగా జాతర

పావగడ: తాలూకా వ్యాప్తంగా పలు గ్రామాల్లో గ్రామ దేవతల (యాట్లు దీపాలు) జాతరోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. పట్టణంలోని కురుబర వీధిలో ముత్యాలమ్మదేవి జాతరను ఘనంగా నిర్వహించారు. అలాగే కురుబరహళ్లిలో దుర్గాదేవి జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లను గ్రామాల్లో భారీ ఎత్తున ఊరేగించారు. అమ్మవారికి మహిళలు జ్యోతులు మోశారు.

విద్యతోనే దేశాభివృద్ధి


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

అగళి: పిల్లలు బడిబాట పడితే వారి జీవితం పూలబాటవుతుందని ఎంఈఓ– 2 చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రలోని మండల విద్యాధికారి ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయం విద్యార్థులతో కలిసి అక్షరాలను నేర్చుకుందాం భవిష్యత్తుకై ముందుకు సాగుదాం అంటూ ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ–2 మాట్లాడుతూ విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి పిల్లలను బడికి చేర్చాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన కల్పించాలి


కేన్సర్ స్క్రీనింగ్ శిక్షణను పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి నివేదిత

హిందూపురం టౌన్: ప్రజలకు కేన్సర్‌పై అవగాహన కల్పించి, వారిలో చైతన్యం తీసుకురావాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమాల జిల్లా అధికారి డాక్టర్ నివేదిత సూచించారు. మంగళవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో జరుగుతున్న కేన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ శిబిరంలో వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీల హాజరు పట్టికను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నివేదిత మాట్లాడుతూ కేన్సర్‌ను నివారించడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. శిక్షణ పొందిన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, గ్రామాలలో ప్రజలకు కేన్సర్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. తొలిదశలోనే గుర్తించడం ద్వారా ప్రాణాపాయం నుంచి కాపాడుకోవచ్చన్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న వారికి శిక్షణకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మాధుర్య, డాక్టర్ శశిరేఖ, హెచ్ఓ వన్నప్ప, సూర్యశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మా కరుణించమ్మా...

రొళ్ల: మండల పరిధిలోని కొత్తపాళ్యం తండాలో మంగళవారం గ్రామ దేవత మారెమ్మకు జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు ఆనందంగా ఉండాలని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శివకుమార్‌నాయక్, ఆనంద్‌నాయక్ తదితరుల ఆహ్వానం మేరకు జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, సర్పంచ్ ప్రకాష్, మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, ఎంపీటీసీ సభ్యుడు శివన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, హులికుంట వైస్ సర్పంచ్ రవికుమార్ విందులో పాల్గొన్నారు.

కరియమ్మకు హారతుల ఉత్సవం

అమరాపురం: మండలంలోని వి.అగ్రహారంలో వెలసిన కరియమ్మ దేవికి భక్తులు హారతుల ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాద వినియోగం చేశారు.

విద్యా సామగ్రి పంపిణీ

లేపాక్షి: మండలంలోని మైదుగోళం ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ఉదయం హిందూపురానికి చెందిన వ్యాపారవేత్త మూర్తి నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యాసామగ్రి అందజేసిన దాతకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు క్షీరలింగేశ్వర, ఉపాధ్యాయులు మురళీ, సతీష్, రామచంద్ర, సాల్మాన్, లక్ష్మీనారాయణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ఆడిటోరియం నిర్మిస్తాం


మొక్కకు నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ: స్థానిక వై.ఈ రంగయ్యశెట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆడిటోరియం నిర్మిస్తామని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ హామీ ఇచ్చారు. ఆ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఖోఖో పోటీలను ప్రారంభించిన తర్వాత ఎమ్మెల్యే మాట్లాడారు. రూ 5.78 కోట్ల నిధులతో ఆడిటోరియం, 5 గదుల నిర్మాణానికి త్వరలోనే భూమి పూజ చేస్తామన్నారు. అలాగే డిప్లొమా కళాశాల ఏర్పాటుకు అనేక ప్రయత్నిస్తున్నామని, తాలూకాలో భారీ సోలార్ ప్రాజెక్ట్ ఉండడంతో ఈ ప్రాంత విద్యార్థులు ఇక్కడే శిక్షణ పొంది సోలార్ కంపెనీలో ఉద్యోగాలు పొందే అవకాశముంటుదన్నారు.


గుడిబండ: భారీ వర్షాలకు కొంకల్లు చెరువులోకి చేరుతున్న నీరు


అమరాపురంలో భారీ వర్షం కురుస్తున్న దృశ్యం


మడకశిరలో వర్షం పడుతున్న దృశ్యం

వర్షం జోరు.. అన్నదాత హుషారు

సాక్షిబృందం: మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, అమరాపురం, గుడిబండ మండలాల్లో మంగళవారం వర్షం దంచి కొట్టింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పారాయి. కొన్ని ప్రాంతాల్లో పంట పొలాల్లో భారీగా నీరు నిలిచింది. మరోవైపు పెనుకొండ నియోజకవర్గంలోని పరిగి మండలంలో మంగళవారం సాయంత్రం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో వర్షం ధాటికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయమేర్పడింది. నైరుతి రుతుపవనాల రాకతో జోరుగా వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు సంతోషంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.